# తిరిగి వచ్చిన బాల్యం

తెల్లవారుఝామున నాలుగు గంటలు కొట్టింది గడియారం.

ఉయ్యాలలో పడుకున్న పసివాడు ఏడుస్తూ లేచాడు. కలిపి పెట్టిన పాలు సీసాలోపోసి పిల్లవాడికి తాగిస్తుండగా పక్క గదిలో సోమసుందరంగారు లేచి దగ్గుతున్న చప్పుడు వినబడ్డది కమలకు.

కంగారుగా లేచి దిండు ఆసరాతో పిల్లవాడినోటికి పాలసీసా అందించి, ఫ్లాస్కులో పోసిన వేడినీళ్ళతో హార్లిక్సు కలిపి మామగారి గదిలోకి వెళ్ళింది గ్లాసుతో కమల.

అప్పటికి ఆయన లేచి గడియారం వంక చూస్తూ కూర్చున్నారు.

"హార్లిక్సు తెచ్చాను తీసుకోండి'' చెయ్యి ముందుకుచాపింది.

"గడియారం నాలుగు గంటలు కొట్టి ఎంతసేపయింది ? ఇప్పుడా తీరు బడిగా హార్లిక్సు తెచ్చావు ?" వేడి వేడి హార్లిక్సూ ఆమె చేతిలోంచి తీసుకుని ఆమె ముఖమ్మీదికి విసిరాడు సోమసుందరంగారు.

వేడి వేడి హార్లిక్సు ముఖమ్మీద పడగానే ఆపుకుందామన్నా ఆగని కేక- అమ్మో అంటూ ఆమె నోటినుంచి బైటికి వచ్చింది. ఒక్క అంగలో గదిలోకి వచ్చింది. పిల్లవాడి నోట్లోనుంచి పాలసీసా పక్కకు పడిపోయినట్టుంది. గుక్క పట్టి ఏడుస్తున్నాడు.

నారాయణ కమలా అంటూ లేచి, ఆమె కనబడకపోయేసరికి పాలసీసా పిల్లవాడి నోటికందించి తల పక్కకు తిప్పిచూశాడు.

కమల కళ్ళు తుడుచుకుంటూ మంచమ్మీద చతికిల బడ్డది.

''ఏమయింది కమలా ? ముఖమట్లా కందిపోయిందేమిటి ? ఎందుకా ఏడుపు ?'' నారాయణ ఉయ్యాల దగ్గర్నుంచి వచ్చాడు.

కమల ముఖం ఎర్రగా కందిపోయింది. బుగ్గలమీద పడిన వేడి వేడి హార్లిక్సుతో ఆస్థలం కమిలిపోయింది. వెక్కుతూ జరిగిందంతా చెప్పింది.

"నేనేం చెయ్యను ? నాలుగు గంటలకు నానీకి పాలుపట్టేవేళ. సరిగ్గా మీ నాన్నగారికి హార్లిక్సు వేళకూడా అదే. వీడికి పాలుకలిపి పాలసీసా నోట్లోపెట్టక పోతే గుక్కపట్టి ఏడుస్తాడు. ఆయనకు వేళకు హార్లిక్సు కలిపి ఇవ్వకపోతే ఇంటి పెంకు లెగరకొడతారు. కాస్త- రెండునిమిషాలు ఆలస్యమైందని వేడి వేడి హార్లిక్సు నా ముఖమ్మీద పోశారు. ముఖమంతా మంటపుడుతోంది" ముఖం చేతులతో కప్పు కుంది.

ఆమెబాధ ఏస్థాయిలో ఉందో ఆమె ముఖమే చెబుతోంది. ఎర్రబడినదల్లా నల్లగా కమిలిపోయింది. కన్నీటిధారలు బుగ్గలమీదుగా జాలువారుతున్నాయి.

"వాడు పాలుతాగి పడుకుంటాడులే, చీరకొంగుతో ముఖం తుడుచుకోకు నేనిప్పుడే వస్తా" అంటూ దూదిని కొబ్బరినూనెలో ముంచి ముఖమంతా అద్ది, ఆమె తలను దిండుమీదికి చేర్చాడు. "అలా పడుకో కాసేపు."

గబగబా హార్లిక్సు కలిపి తండ్రి గదిలోకి వెళ్ళి "నాన్నా, హార్లిక్సు తెచ్చాను తీసుకో" అన్నాడు గదిలోకి వెళ్ళి.

అప్పటికి సోమసుందరంగారు చెవులమీదుగా మఫ్లర్ తలకు చుట్టుకుని మంచందగ్గరగా ఉన్న కిటికీలోంచి బైటికి చూస్తున్నారు. నారాయణ పిలుపుకు తల తిప్పి "నారాయణా, నా హార్లిక్సు వేళ సరిగ్గా నాలుగుగంటలు. ఇప్పుడు టైమెంతయిందో చూడు. నేను వేళ తప్పితే మరి తీసుకోనని తెలియదూ నీకు ?" అన్నాడు ముఖం పక్కకు తిప్పుకుంటూ విసురుగా.

"ఎంతో కాలేదు నాన్నా, పదినిమిషాల ఆలస్యంకూడా కాలేదు. నీరసం వస్తుంది తీసుకో" అక్కడే నిలబడ్డాడు గ్లాసు పట్టుకుని.

"వద్దంటే వద్దు, అంతే. నావేళ దాటిపోయింది. ఇప్పుడవసరం లేదు" పక్కకు తిరిగి పడుకున్నాడు.

ఇంక లాభంలేదని, నారాయణ తలుపు దగ్గరగా వేసి తన గదికి చేరు కున్నాడు.

అప్పటికి కమల పిల్లవాడి నోట్లోంచి పాలసీసా తీసి దుప్పటికప్పి నిద్ర బుచ్చింది. మంటమండుతున్న ముఖానికి చల్లగా ఉంటుందని పేపరుతో విసురు కుంటోంది కన్నీళ్ళు కారుస్తూ.

''కమలా, తెల్లవారితే డాక్టరు దగ్గరికెళ్ళి మందుతెస్తాను- ముఖానికి నీళ్ళు తగలనీయకు." పేపరు ఆమె చేతిలోనుంచి తీసుకుని తను విసరటం మొదలు పెట్టాడు.

ఏడుపులతో, ఓదార్పులతో తెల్లవారింది.

నారాయణ పాలు రాగానే కాఫీ కలిపాడు. రెండు గ్లాసుల్లోపోసి తీసుకు వచ్చి "కమలా, ముఖం తడవనీయకుండా పళ్ళు తోముకుని రా. కాఫీ తాగుదాం" అంటూ బల్లమీద పెట్టాడు. ఆమె రాగానే గ్లాసు ఆమె చేతికిచ్చి, తను కాఫీ తాగుతూ- ''కమలా, బాధపడకు. ఆయనకు కోపంవస్తే ఒళ్ళుతెలియదు. ఏం చేస్తాం? నీవు లేచి వంటచెయ్యాలని తొందరపడకు, నేను డాక్టర్ని మందు తీసుకు వస్తాను. నా కాఫీసుకు తొందరలేదు, కొంచెమాలస్యంగా వెళ్ళచ్చు" అంటూ మంచమ్మీదినుంచి లేచి కాఫీగ్లాసుతో తండ్రి కివ్వాలని బయలుదేరాడు.

అప్పటికి ముఖం కడుక్కొని వరెండాలో కుర్చీమీద కూర్చుని పేపరు చదువుతున్నారు సోమసుందరంగారు. ఆయనకు కాఫీగ్లాసందిస్తూ "నాన్నా, రాత్రి బాగా నిద్రపట్టిందా ?'' అంటూ కుశలప్రశ్నలు వేశాడు నారాయణ.

''ఒక రాత్రివేళ కరెంటు పోయిందిరా. దగ్గర విసనకర్రయినా లేదు విసురుకుందా మనుకుంటే. అలా చికాకుగా ఉండగానే కరెంటు వచ్చిందిలే. ఇవాల్టి పేపరు చూశావా ? దుర్మార్గాలూ, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయి. ఆఫీసర్లను ఎత్తుకుపోవటం ఇప్పుడే చూస్తున్నాం కక్షలూ కార్పణ్యాలు ఒకరిమీద ఒకరు తీర్చు కుంటూ కులాలను అడ్డు పెట్టుకుంటున్నారు. అందరికీ కోరికలెక్కువయి పొయ్యాయి. సమస్యలు మావి ముఖ్యమంటే, మావి మరీ ముఖ్యమంటున్నారు. ప్రజ లలో ఈరకం తెలివితేటలు ఎక్కువయ్యాయి. మోసాలూ, దగాలూ అధికంగా ఉన్నాయి. మరీ ఇంత అరాచకం ఎప్పుడూ చూడలేదు. ఇప్పట్లో బాగుపడుతుం దంటావా దేశం ? కాఫీ తాగి గ్లాసు తిరిగి ఇచ్చాడు. నారాయణ నవ్వుతూ అందు కుని లోపలికి వెళ్ళాడు 'ఆలస్యం చేస్తే డాక్టరు క్లినిక్‌లో కూర్చుంటాడు' అను కుంటూ గబగబా నడిచాడు

"నారాయణా, పొద్దున్నే వచ్చావు ఏమిటి సంగతి ? మీనాన్నగారు ఎట్లా ఉన్నారు ?'' అడిగాడు పేపరుపక్కకుపెట్టి డాక్టరు.

"ఆయనకేం? లక్షణంగా ఉన్నారు. పేపరు చదువుకుంటారు. రాజకీయాలు మాట్లాడుతారు, రెండుపూటలూ వాకింగ్‌కి వెళ్తారు.''

"అబ్బాయికా మీ ఆవిడకా సుస్తీ ?"

నారాయణకు సంగతంతా చెప్పక తప్పింది కాదు.

''మానాన్న నాలుగురోజుల కొకసారయినా ఒకనిమిష మాలస్యమయితే హార్లిక్సు ముఖమ్మీద పోస్తాడు. ఒకోరోజు వడ్డించిన పళ్ళెం విసిరేస్తాడు. ఏమిటో అంత కోపం. మళ్ళీ అంతలో పోతుంది. ఆయనకు ఎంతోనిదానం గల ఆఫీసరని పేరు. ఇప్పుడు కమల అటు చిన్నపిల్లవాడికీ, ఇటు నాన్నకీ మధ్య నలిగిపోతున్నది. మధ్య మధ్య ఏడుస్తుంది.''

బుజమ్మీద చెయ్యేస్తూ వచ్చేశాడు డాక్టరు.

అయినా నాన్నకు మతిపోతోందనిపిస్తుంది ఒకోసారి. గది ఊడవటానికి వెళ్ళిన పనిమనిషి ఆయన టైమ్‌ప్రకారం వచ్చి ఊడవకపోతే ఆ చీపురు తీసుకుని విసిరేస్తాడు. మంగలివాడు కాస్త ముందుగా వచ్చినా అలస్యంగా వచ్చినా చివాట్లే. అతడిని తిట్టిపంపించాడు మొన్న. ఇప్పుడు ఇంకొకరు దొరికేవరకూ నేను వీధులు పట్టుకుని తిరగాలి. అంతమంచివాడయిన నాన్న ఇప్పుడిట్లా మారిపోయాడంటే మతిచలించిందేమోనని భయంగా ఉంది. ఇది తీవ్రరూపందాలిస్తే నా గతేమిటి ?"

"కాస్తకూ కూస్తకూ నా గతేమిటనుకుంటే ఎట్లాగోయ్ ? ఇంకా కమల పరిస్థితులను అర్థం చేసుకుని సర్దుకుపోయే మనిషి కనుక నీవిట్లా ఉన్నావు. లేక పోతే నీకూ మతిపోయే పరిస్థితి."

డాక్టరికి నవ్వొస్తోంది.

"ఏమో బాబూ, నాకు ఇంటికి రావాలంటే చికాకుగా ఉంటోంది."

"సరేలే, సాయంత్రం నేను వచ్చి చూస్తాను. ఇంతలోకి నీవు మతిపోగొట్టు కోకు" లేచి నారాయణను సాగనంపాడు.

నారాయణ ఇంటికి వచ్చేసరికి కమల మెల్లగా లేచి కుక్కరు పొయ్యిమీది

క్కెక్కించింది. పిల్లవాడు స్నానంచేసి పాలు తాగి హాయిగా ఉయ్యాలలో నిద్ర పోతున్నాడు. సోమసుందరంగారు స్నానంచేసి భక్తిగీతాలు పాడుకుంటున్నారు.

నారాయణ మనసు కొద్దిగా శాంతించినట్లు కనబడ్డది. ఆ వాతావరణం చూసిన తరువాత. వంట పూర్తిచేసి తండ్రీ తనూ భోజనాలు చేశారు. ఒంటిగంట తరువాత నారాయణ ఆఫీసుకు వెళ్ళాడు.

సాయంత్రము ఆరుగంటల వేళకు డాక్టరు వచ్చాడు. ముందుగా సోమ సుందరంగారి గదిలోకి వెళ్ళి "ఎలా ఉన్నారు? ఆరోగ్యం బాగుందా? పేపరు బాగా చదవగలుగుతున్నారా? ఇంకా కేటరాక్టురాలేదనుకుంటాను. మీరే నయం మాకంటె" అంటూ ఆయనకెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"ఇంతవరకూ రాలేదు. పేపరు మొదటినుంచీ చివరివరకూ చదివితేనేగాని తోచదు. ఇది నా అలవాటు. నారాయణ ఆఫీసునుంచి వచ్చినట్టున్నాడు మీకు కన బడ్డాడా?" అంటూ కబుర్లు మొదలుపెట్టాడు. తన కాలంనాటి రాజకీయాలతో పోలుస్తూ నేటి రాజకీయాలను ఖండనం చేశాడు.

"అందరిలోనూ తొందరపాటు ఎక్కువయింది. గెట్ రిచ్ క్విక్ ధోరణి ప్రతివాడికీ ఎక్కువయింది ప్రతి పనికి అడ్డదారులు తొక్కటమే కనబడుతోంది."

డాక్టరు నవ్వుతూ ''మీరు బ్రిటీషువారి అత్యంత విశ్వాసపాత్రులైన ఉద్యో గులు. ఇప్పుడందరికీ స్వాతంత్ర్యం వచ్చింది కదండీ. మీ మాదిరిగా ఉండమంటే ఎలా ఉంటారు? సరే ఈ రాజకీయాలు మనం మాట్లాడుకుంటుంటే నాకు అవతల రోగులు గోలపెడతారు. మీరు వాకింగ్‌కు వెళ్ళటం మానలేదుకదా?"

"లేదు, వర్షం లేకపోతే రెండుపూటలా వెళ్తాను."

"సరే, లోపలికి వెళ్ళి నారాయణను కూడా పలకరించి వెళ్తాను, నమస్కారం" అంటూ లేచాడు.

కమల ఆయనను చూడగానే ముఖం పక్కకు పెట్టుకుని కాఫీ తెచ్చి యిచ్చింది.

"ఏమిటమ్మా? రాత్రి సరిగా నిద్రపోలేదుట? ముఖం చూపించు?"

కమల కళ్ళుదించుకుని ముఖం ఆయనకేసి తిప్పింది.

"తగ్గిపోతుంది, బొబ్బలెక్కలేదు. కమిలిపోయింది. కొబ్బరినూనెలో దూది ముంచి అరగా అరగా రాస్తూ ఉండు. రెండురోజుల్లో అదే తగ్గిపోతుంది."

ఎదురుగా వచ్చిన నారాయణతో "మతి పోగొట్టుకోకుండా ఆఫీసుకు వెళ్ళావా ?" అడిగాడు.

నారాయణ నవ్వుతూ ఆయనకు కుర్చీచూపించి తనూ కూర్చున్నాడు.

"చూడు నారాయణా, మీ నాన్నగారితో చాలా సేపు మాట్లాడాను. అసలు ముందు ఆయన గదిలోకే వెళ్ళాను. ఆయన అన్ని సంగతులూ ఎక్కువగా రాజకీయాలే చక్కగా మాట్లాడారు. అందులోనూ లౌక్యముంది. ఆయన ఏదయినా హంగామా చేస్తే అది వయసుది గాని ఆయనదికాదు. ఆయన నీకొడుకనుకో. కోపంవస్తే అర్థంలేని అల్లరిచేస్తాడు కదా? మళ్ళీ అంతలోనే సర్దుకుంటాడు. ఆయనకేం మతిపోలేదు. ఆరోగ్యం కూడా బాగుంది. ప్రతి మనిషికీ పెద్దతనం వచ్చిన తరువాత బాల్యదశ తిరిగివస్తుంది. ఇది చాలా చిన్నస్థాయిలో ఉంది. ఇంకా ఇంకా కొందరిది మరీ ఘోరంగా ఉంటుందనుకో. ప్రతి దానికీ గాభరాపడకుండా ఎదుర్కోవటం నేర్చుకోవాలి. మరి, నేను వెళ్ళనా! మరీ మించిపోతే నాదగ్గరికి తీసుకురా" నవ్వుతూ వెళ్ళిపోయాడు డాక్టరు.

కమలా నారాయణా ముఖాముఖాలు చూసుకున్నారు.